క్లుప్తంగా

నడిగూడెం మండలంలో వర్షం



నడిగూడెంలోని బీసీ కాలనీలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, బీసీ, ఎస్సీ కాలనీలలో వీధుల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, క్షేత్రపాలకుడికి పంచామృతాలతో అభిషేకం, ఆకుపూజ, అష్టోత్తర శతనామావళి, సహస్ర నామ ఫల పుష్పార్చన, గోత్రనామార్చన, ఆరగింపు, మంగళాశాసనం, పాశుర ఉచ్చరణ, తీర్థప్రగోష్ఠి వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవో వెంకటచలపతి, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

చేతిపంపును వినియోగంలోకి తీసుకురావాలి



బేతవోలు రోడ్డులో నిరుపయోగంగా చేతి పంపు

చిలుకూరు : మండలంలోని బేతవోలు రోడ్డులో పిల్ల కాలువ దగ్గర గల చేతిపంపు నిరుపయోగంగా ఉంది. ఎండలు మండిపోతున్నందున చేతిపంపునకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకొస్తే వాహనదారులు, పశువుల దాహార్తి తీరుతుందని పలువురు వాహనదారులు అంటున్నారు. బోర్లలో నీరు ఉన్నా అధికారులు ఎందుకు వినియోగంలోకి తీసుకురావడం లేదని ప్రశ్నిస్తున్నారు.

సీపీఎం నాయకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి



సమావేశంలో సీపీఎం, కాంగ్రెస్ నాయకులు

నేరేడుచర్ల : సీపీఎం నాయకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో జరిగిన కాంగ్రెస్, సీపీఎం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు జిడిమెట్ల రవిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి దాడి చేసి గాయపరిచారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, నాగరాజు, భార్గవ సైదులు, శ్రీధర్, నాగేశ్వర్‌రావు, హరిబాబు, లక్ష్మీనర్సింహులు, సుధాకర్, పవన్ తదితరులు ఉన్నారు.

ఉల్టాగా ఊరి పేరు!



తలకిందులుగా నేమ్ బోర్డు

మాడుగులపల్లి : మాడుగులపల్లి మండలం ఆగమోతుక్కూర్ శివారులో ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు తలకిందులైంది. వాహనదారులకు సమాచారం తెలిసేలా పెట్టిన బోర్డు తలకిందులుగా ఉండడంతో అటుగా వెళ్లే వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బోర్డు ఇలా నెలలుగా ఉల్టాగా ఉంటున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే బోర్డును సరిచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

నిడమనూరు : గుంటకగూడెం అవుట్ స్పాట్ వద్ద పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో నిడమనూరు పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది జూదరులను మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.23 వేల నగదు, 8 సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసున్నామని ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. పట్టుబడిన వారు నిడమనూరు, గుంటకగూడెం, ముప్పారం, అలీ నగర్‌కు చెందిన వారిగా పేర్కొన్నారు.

డబుల్ రోడ్డుగా మారేదెప్పుడో!

- ప్రమాదకరంగా మొద్దులచెరువు–మోతె రహదారి
- ఇరుపక్కలా రోడ్డు ఆక్రమణ
- అడుగడుగునా గుంతలు
- మూలమలుపుల్లో నిత్యం ప్రమాదాలు



మొద్దులచెరువు- మోతె ఆర్‌అండ్‌బీ రహదారి

మునగాల : మండలంలోని మొద్దులచెరువు నుంచి మోతె మండల కేంద్రం వరకు గల 13 కిలోమీటర్ల పొడవు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. రహదారి ఇరుపక్కల ఆక్రమణకు గురవుతోంది. కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. అంతేకాకుండా అనేక మూలమలుపులు ఉండడంతో రహదారిపై ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హైదరాబాద్ – విజయవాడ హైవే ఎన్‌హెచ్‌- 65, సూర్యాపేట– ఖమ్మం హైవే ఎన్‌హెచ్‌- 365 లను కలిపే ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని మోతె, మునగాల మండల ప్రజలు గత కొంతకాలంగా కోరుతున్నారు. ఈమేరకు పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చితే రెండు మండలాలకు చెందిన సుమారు పది గ్రామాల ప్రజలు ఇటు హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం పట్టణాలకు వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. కావున జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



మొద్దులచెరువు– మోతె మధ్య గల రోడ్డుపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి మూలమలుపులతో ఉండడంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. డబుల్ రోడ్డుగా మార్చాలని గతంలో కోదాడ ఎమ్మెల్యేను లిఖితపూర్వకంగా కోరాం.

– సొంపంగు జానయ్య, రేపాల

రోడ్డు ఆక్రమణకు గురవుతోంది



మొద్దులచెరువు రోడ్డు ఇరుపక్కలా ఆక్రమణకు గురవుతోంది. గుంతలమయంగా మారి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా ప్రయాణించే వీలు లేదు. మూలమలుపులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు సంభవించి పలువురు మృత్యువాత పడుతున్నారు. రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలి.

– మొగిలిచెర్ల నాగరాజు, నరసింహులగూడెం

ప్రతిపాదనలు పంపాం

మొద్దులచెరువు నుంచి మోతె వరకు గల 12.8 కిలోమీటర్ల మేర రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాం. ప్రస్తుతం నిధుల కొరత మూలంగా రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చలేకపోతున్నాం.

– బి.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, మునగాల

నీటి తొట్లు నింపిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

చిలుకూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో గల నీటి తొట్లు నిరుపయోగంగా మారడంతో మూగజీవాలు తాగునీటి కోసం అల్లాడుతున్నాయని మంగళవారం సాక్షిలో 'నిరుపయోగంగా నీటి తొట్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు స్పందించారు. గ్రామాల శివారులో ఉన్న నీటితొట్లను గ్రామ పంచాయతీ ట్యాంకర్లతో నీరు నింపారు. దీంతో మేత కోసం పొలాలకు వెళ్లిన పశువులు నీటి తొట్లలో నీరు తాగాయి. కాగా, మూగజీవాల దాహార్తి తీర్చేందుకు కృషి చేసిన సాక్షికి పాడి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



జెర్రిపోతులగూడెంలోని నీటి తొట్టిలో నింపిన నీటిని తాగుతున్న పశువులు

'భగీరథ' నీటి వృథాపై పట్టింపేదీ !





చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో పైప్‌లైన్ లీకై వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై పలుచోట్ల మిషన్ భగీరథ పైపులైన్ లీకై గత కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతోంది. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.. పైపులైన్ లీకై నీరు కలుషితం అవుతోందని తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.2లక్షల బీమా చెక్కు అందజేత

తుంగతుర్తి : నాగారం మండల పరిధిలోని పస్తాల గ్రామానికి చెందిన నాతి యాదమ్మ తుంగతుర్తిలోని సహకార బ్యాంక్‌లో ఖాతాను కలిగి ఉండి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై)లో చేరింది. అయితే ఇటీవల ఆమె అనారోగ్యంతో చనిపోవడంతో జేజేబీవై పథకం కింద మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ మంజూరైంది. ఆ చెక్కును మంగళవారం మృతురాలి కుటుంబానికి డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు మేనేజర్ శ్రావణ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, సొసైటీ సెక్రటరీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్

మృతురాలికి నివాళి



నివాళులర్పిస్తున్న సూర్యాపేట జెడ్పీటీసీ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మద్దూరి ఆనంద్ భార్య మద్దూరి సుగుణమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. దీంతో మృతురాలికి సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య, చినతిరుమల్‌రావు, వాసుదేవరెడ్డి, కోటిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు నివాళులర్పించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : మండల పరిధిలోని పసునూర్ ఆదర్శ పాఠశాల/కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కుంట రమేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ కోసం ఈ నెల 10 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 40 సీట్లు, బైపీసీలో 40సీట్లు, సీఈసీలో 40సీట్లు, ఎంఈసీ విభాగంలో 40సీట్ల చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం సెల్: 98489 38934 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కార్యకర్తల కృషి అభినందనీయం



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

సూర్యాపేట : భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్ విజయాన్ని కాంక్షిస్తూ కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేయడం అభినందనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంబీఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో సీపీఎం అభ్యర్థి ఓడినా, గెలిచినా ప్రజల కోసం నీతిగా, నిజాయితీగా పనిచేస్తాడని తెలిపారు. ఎన్నికల్లో సహకరించిన ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందికి, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, మట్టిపల్లి సైదులు, వెంకటేశ్వర్లు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, కందాల శంకర్ రెడ్డి, శ్రీనివాస్, పులుసు సత్యం, ఉప్పలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణకు శ్రీరామ రక్ష

మిర్యాలగూడ : బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణకు శ్రీరామ రక్ష అని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసిన ఓటర్లకు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించిన పార్టీ శ్రేణులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్తకు గులాబీ జెండా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

రఘువీర్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయం

నడిగూడెం : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని ఎంపీపీ యాతాకుల జ్యోతి అన్నారు. మంగళవారం నడిగూడెం మండలంలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ వస్తుందని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

గరిడేపల్లి : ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రణబోతు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎలక సైదిరెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడారు. లాఠీచార్జ్ చేసిన పోలీసులను కూడా సస్పెండ్ చేయాలన్నారు.

'లక్ష మెజార్టీతో కాంగ్రెస్ గెలుపు'

నాగారం : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కడారి రజినీకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించి ఓట్లు వేశారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 40 రోజుల పాటు శ్రమించి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి సోమయ్య, కొమ్ము యాకస్వామి, చిప్పలపల్లి ఉపేందర్, ఆకారపు క్రిష్టయ్య, చిప్పలపల్లి శివ, కడారి రమేష్ తదితరులు ఉన్నారు.

వీల్ చైర్ బహూకరణ

నూతనకల్ : నూతనకల్ మండల కేంద్రంలోని నీలకంఠ ఫిల్లింగ్ స్టేషన్ యాజమాన్యం ఆర్థిక సహకారంతో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం వీల్ చైర్ బహూకరించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి కీసర అక్షితారెడ్డి మాట్లాడారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం దాతలు వీల్‌చైర్‌ను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నీలకంఠ ఫిల్లింగ్ స్టేషన్ యాజమాన్యం సభ్యులు భీమిడి యుద్ధంరెడ్డి, నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి జానారెడ్డి పరామర్శ

నిడమనూరు : మండలంలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎదుల్ల నరసింహారెడ్డిని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మంగళవారం పరామర్శించారు. షుగర్ వ్యాధి కారణంగా నరసింహారెడ్డి మోకాలి కింది భాగం వరకు శస్త్రచికిత్స చేసి తొలగించారు. సమాచారం తెలుసుకున్న జానా రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నందికొండ రాజేశ్వరి మట్టారెడ్డి, యడవెల్లి రంగసాయి రెడ్డి, అంకతి సత్యం, మేరెడ్డి వెంకట్ రాహుల్, ముంగి జ్యోతి, శివ, మారయ్య, ఎంపీటీసీ లక్ష్మీ వెంకట్ రెడ్డి, యాదుల్ల పద్మ వెంకటరమణ, సైదయ్య నాయుడు, కొండా శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు ధన్యవాదాలు : మల్లయ్య

మాడుగులపల్లి : నల్లగొండ లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడ్డ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. నల్లగొండ ఎంపీగా కుందూరు రఘువీర్‌రెడ్డి 3లక్షలకుపైగా మెజార్టీతో విజయం సాధించబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని, రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారని తెలిపారు.

అరుణ్‌కుమార్‌కు మంత్రి ఉత్తమ్ పరామర్శ

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, బూరుగడ్డ మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ మాతృమూర్తి నాగలక్ష్మి ఇటీవల మృతి చెందారు. మంగళవారం రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బూరుగడ్డలో అరుణ్‌కుమార్‌ను పరామర్శించారు. అనంతరం నాగలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రాధికాఅరుణ్‌కుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



అరుణ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వైభవంగా మహాలక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని తొగర్రాయి శివారులో గల మరకత మహాలక్ష్మీదేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని తీరొక్క పూలతో అలంకరించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, అభిషేకాలు, చక్రస్నానం, పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. స్థానికులతో పాటు కోదాడ పట్టణం, మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలెబోయిన వెంకయ్య, యాదా ఉపేందర్‌రావు, గుండపునేని ప్రభాకర్‌రావు, వీరబాబు, బుడిగం నానీ, కొండల్‌రావు, వీరస్వామి, తేరళ, మోహన్‌రావు, భక్తులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

కేంద్రంలో మూడోసారి బీజేపీదే ప్రభుత్వం



సమావేశంలో పాల్గొన్న బండారు కవిత, నాయకులు, కార్యకర్తలు

నడిగూడెం : కేంద్రంలో మూడోసారి బీజేపీదే ప్రభుత్వం అని పార్లమెంటు ఎన్నికల బీజేపీ నడిగూడెం మండల ఇన్‌చార్జి బండారు కవిత అన్నారు. మంగళవారం నడిగూడెం మండల పరిధిలోని కాగితరామచంద్రాపురంలో నిర్వహించిన ఆ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సీట్లలో బీజేపీ గెలుస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, మండల మాజీ అధ్యక్షుడు రొండ్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు లతీఫ్, ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, నాయకులు బండారు శోభారాణి, వీరబాబు, పాపయ్య, రామకృష్ణ, గుర్వయ్య, రౌతు కళ్యాణ్, కాసాని లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

చిన్నారులకు స్వర్ణప్రాసన ఔషధం పంపిణీ

కోదాడరూరల్ : పిల్లలకు రోగ నిరోధక శక్తిని పెంచేందుకు స్వర్ణప్రాసన మందు ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ సురేష్ జకోటియా అన్నారు. మంగళవారం మండలంలోని తమ్మరలో గల ఆయుర్వేద వైద్యశాలలో పుష్య నక్షత్రాన్ని పురస్కరించుకొని వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 16 సంవత్సరాలలోపు పిల్లలకు స్వర్ణప్రాసన ఔషధాన్ని పంపిణీ చేసి మాట్లాడారు. నేటి సమాజంలో చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తక్కువ ఉంటుందని, ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఈ స్వర్ణప్రాసనాన్ని తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు మానసిక వికాసం, పెరుగుదల బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంగవీటి భరత్‌చంద్ర, లక్ష్మీప్రసన్న, అనంతచక్రవర్తి, నిఖిల్, భరత్, నాగరాజు, భరత్‌కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.



స్వర్ణప్రాసన ఔషధం పంపిణీ కార్యక్రమంలో డాక్టర్ జకోటియా, చిన్నారులు

ఆంజనేయస్వామి ఆలయాల్లో అన్నదానం



కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న దాతలు, నిర్వాహకులు



కోదాడరూరల్ : ఆలయంలో అన్నదానం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గల అభయాంజనేయస్వామి గుడిలో మంగళవారం వజ్రాల వెంకట తరుణ్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా, జూన్ 1న హనుమాన్ జయంతి, ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరలింగాచారి, మెలోన్‌రామ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకురి అంజయ్య, కోట తిరపతయ్య, హనుమంతరావు, కృష్ణమూర్తి, సత్యం, వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి, బస్టాండ్ సెంటర్‌లో గల వీరాంజనేయ స్వామి ఆలయాల్లో మంగళవారం దాతల సహకారంతో ఆలయ కమిటీల సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానాన్ని ఎంపీడీవో గిరిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొదారు వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన గోదల వీరమ్మ అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. దీంతో వైద్య ఖర్చుల కోసం గ్రామానికి చెందిన జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి మంగళవారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

నూతనకల్ : మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన లింగాల అబ్బసాయిలు ఇటీవల మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన పసుల రవి, కేతం మహేందర్‌లు 100కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగాల రామచంద్రు, జలగం యోగానందం, పీఏసీఎస్ డైరెక్టర్ పసుల వెంకన్న, పసుల అశోక్ యాదవ్, అనంతుల నాగలింగం, పసుల సుధాకర్, కొలిచల్మ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నత్తనడకన ధాన్యం కాంటాలు

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా యాసంగిలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావొచ్చాయి. మండల వ్యాప్తంగా పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల అకాల వర్షాలు కురవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దాదాపు అన్ని కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం చేశారు. అయితే అన్ని కొనుగోలు కేంద్రాల్లోనూ కాంటాలు పూర్తికాగా.. మండల పరిధిలోని పాతసూర్యాపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కేంద్ర నిర్వాహకుల అసమర్థత, సమన్వయ లోపంతో కాంటాలు వేగంగా జరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అకాల వర్షాలు పోగా... నాలుగైదు రోజుల పాటు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీనికితోడు వాతావరణం చల్లబడి మబ్బులు పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంటాలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.



పాతసూర్యాపేటలోని కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు